క్లుప్తంగా

కర్మల భవన నిర్మాణానికి రూ.లక్ష విరాళం

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం నిడమానూరులో ప్రజల అవసరార్థం తూర్పు కాపుల కర్మల భవన నిర్మాణానికి గ్రామ మాజీ సర్పంచ్ పరిమి రమేష్ జ్ఞాపకార్థం వారి కోడలు, వైఎస్సార్ సీపీ గ్రామ మహిళా అధ్యక్షురాలు పరిమి సింధూర శుక్రవారం ముందుగా రూ.లక్ష విరాళాన్ని అందజేశారు. సింధూర మాట్లాడుతూ.. గ్రామంలో అద్దెకు వచ్చిన వాళ్లు, ఉత్తరాంధ్ర ప్రజలు అంతిమ యాత్ర నిర్వహించుకునేందుకు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ సమస్యపై గతంలోనే గన్నవరం నియోజకవర్గ ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ దృష్టికి తీసుకెళ్లగా స్పందించి గ్రామంలో రెండు సెంట్ల స్థలంలో కర్మల భవన నిర్మాణానికి కృషి చేస్తానన్నారని గుర్తు చేశారు. కేటాయించబోయే స్థలంలో త్వరలో నిర్మించబోయే ఈ భవన నిర్మాణానికి మొత్తం ఖర్చును తాము భరిస్తామని తెలిపారు.

ఆరోగ్య శిబిరాలతో ప్రజారోగ్యం మెరుగుదల



కంకిపాడు: ఆరోగ్య సురక్ష శిబిరాలతో ప్రజారోగ్యం మెరుగుపడుతుందని డాక్టర్ లిఖిత అన్నారు. ఉప్పలూరు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మండలంలోని నెప్పల్లి గ్రామంలో ఆరోగ్య సురక్ష శిబిరం శుక్రవారం నిర్వహించారు. సాధారణ వ్యాధులు, కంటి సమస్యలపై వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు పంపిణీ చేశారు. 120 మంది రోగులు వైద్య సేవలను వినియోగించుకున్నారు. కార్యక్రమంలో ఆప్తాలమిక్ ఆఫీసర్ వి.వి.రాజేష్‌కుమార్, రాచమళ్ల శ్యాంప్రసాద్, ఏఎన్‌ఎంలు విక్టోరియా, జ్యోతిరాణి, అనిత, సుజాత, ఆరోగ్య కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెనమలూరు: యనమలకుదురులో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ పి.హరిబాబు తెలిపారు. ఆయన శుక్రవారం వివరాలు తెలుపుతూ.. శివపార్వతీ నగర్, సాయినగర్, ఫీడర్ల మరమ్మతుల కారణంగా ఉదయం 6 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత సరఫరా నిలుపుదల చేస్తామన్నారు. దీని కారణంగా యనమలకుదురు ప్రధాన గ్రామం, అవనిగడ్డ కరకట్ట ప్రాంతం, శివపార్వతీనగర్, సాయినగర్, ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామన్నారు. విద్యుత్ వినియోగదారులు గమనించి సిబ్బందికి సహకరించాలని కోరారు.

దంపతులపై దాడి.. కేసు నమోదు

పెనమలూరు: దంపతులపై దాడి చేసిన ఇద్దరు వ్యక్తులపై పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కానూరు ఎండోమెంట్‌కాలనీలో కర్రి విజయ భర్త కర్రి చెన్నకేశవరావు కుటుంబ సభ్యులతో నివాసం ఉంటున్నారు. పూర్వీకుల ఆస్తిలో విజయకు వచ్చిన వాటాలో పక్కనే ఆడపడుచుకు ఇంటి స్థలం వచ్చింది. ఆడపడుచు కూడా ఇల్లు కట్టుకుంది. కాగా ఆడపడుచు ఇంటి ఎదురుగా కంకర గుట్ట ఉందని ఆడపడుచు కుమారుడు పృథ్వీ తల్లిదండ్రులకు చెప్పటంతో ఆడపడుచు భర్త ప్రసాద్ వచ్చి విజయ, ఆమె భర్త చెన్నకేశవరావుతో గొడవ పడి, కుమారుడు పృథ్వీతో కలిసి దంపతులపై దాడి చేశారు. ఈ ఘటనపై బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయటంతో కేసు నమోదు చేశారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో పలువురికి గాయాలు

పెనమలూరు: తాడిగడప వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు అవ్వటంతో పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం తాడిగడపలో ఎండీ సుల్తాన్‌ఖాన్ నివాసం ఉంటున్నాడు. అతను ఈ నెల 2న తాడిగడప నుంచి తాడిగడప డొంక రోడ్డు మీదుగా పప్పుల మిల్లుకు వెళ్లటానికి బైక్‌పై బయలుదేరాడు. అయితే అతను డొంక రోడ్డులో ప్రయాణిస్తున్న సమయంలో వెనుక నుంచి వచ్చిన కారు అతనిని ఢీ కొట్టింది. ఈ ఘటనలో సుల్తాన్ తలకు గాయమైంది. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

కారు ఢీ కొని యువకులకు గాయాలు

పెనమలూరు: కానూరు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులకు గాయాలు కావడంతో పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నూజివీడుకు చెందిన జి.సుజిత్ కానూరులో తాత ఇంటికి వచ్చాడు. తాతకు మందులు తీసుకు రావటానికి బైక్‌పై సుజిత్ అతని బంధువు కె.దిలీప్‌తో కామయ్యతోపునకు బైక్‌పై వెళ్లి మందులు కొన్నారు. తిరిగి బైక్‌పై ఇంటికి వస్తుండగా కానూరు ప్రధాన రహదారిలో ఎదురుగా వచ్చిన కారు వారిని ఢీ కొట్టింది. ఈ ఘటనలో బైక్‌పై ఉన్న ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలయ్యాయి. ఇద్దరిని విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో చికిత్సకై చేర్చారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

చంద్రబాబు మాటలు నమ్మితే నట్టేట మునిగినట్టే

- రాష్ట్ర గృహ నిర్మాణశాఖ మంత్రి వైఎస్సార్ సీపీ అభ్యర్థి జోగి రమేష్
- ప్రొద్దుటూరులో విస్తృతంగా ఎన్నికల ప్రచారం



ప్రొద్దుటూరు ప్రధాన సెంటర్‌లో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ అభ్యర్థి జోగి రమేష్

కంకిపాడు: మోసగాడు చంద్రబాబు మాయమాటలు నమ్మితే నట్టేట మునిగినట్టేనని రాష్ట్ర గృహ నిర్మాణశాఖ మంత్రి, వైఎస్సార్ సీపీ అభ్యర్థి జోగి రమేష్ అన్నారు. మండలంలోని ప్రొద్దుటూరు గ్రామ శివారు కొణతనపాడు, యార్లగడ్డవారిగూడెం, ప్రధాన గ్రామమైన ప్రొద్దుటూరు గ్రామాల్లో శుక్రవారం రాత్రి విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మంత్రి జోగి రమేష్‌కు ప్రజలు అడుగడుగునా హారతులు పట్టి ఘన స్వాగతం పలికారు. జై జగన్ జై జోగి నినాదాలతో గ్రామం మారుమోగింది. అపూర్వ స్వాగతం పలుకుతూ ఆదరించారు. ప్రజా సమస్యలు అడిగితెలుసుకుంటూ అండగా ఉంటానని భరోసా కల్పించారు. ఆయా గ్రామాల్లోని ప్రధాన కూడళ్లలో జరిగిన సభల్లో మంత్రి జోగి రమేష్ మాట్లాడుతూ.. నయవంచకుడు, వెన్నుపోటుదారుడు చంద్రబాబు అని విమర్శించారు. పిల్లనిచ్చిన మామకే వెన్నుపోటు పొడిచిన వ్యక్తి ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి ప్రజల్ని వంచించిన ఘనుడు చంద్రబాబు ఒక్కడేనని ఆరోపించారు. అధికారం కోసం మాయ మాటలు చెప్పే జిత్తుల మారి చంద్రబాబును నమ్మితే నష్టపోవాల్సి ఉంటుందన్నారు. సంక్షేమం, అభివృద్ధి కొనసాగాలంటే మళ్లీ వైఎస్సార్ సీపీకి అధికారం ఇవ్వాలని, పెనమలూరు అసెంబ్లీ, మచిలీపట్నం ఎంపీ స్థానాలను గెలిపించాలని రెండు ఓట్లూ ఫ్యాన్ గుర్తుపై వేయాలని విజ్ఞప్తి చేశారు.

సమస్యలను పరిష్కరిస్తా..

దోచుకోవటం, దాచుకోవటం తనకు తెలియదని, ప్రజా సంక్షేమమే తనకు తెలుసునని మంత్రి జోగి రమేష్ అన్నారు. జగనన్న బాటలో ప్రజా సంక్షేమానికి పాటుపడతానన్నారు. పెనమలూరు నియోజకవర్గంలో పర్యటిస్తూ ఆయా ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలన్నింటినీ తెలుసుకున్నానన్నారు. ప్రాధాన్యతా క్రమంలో సమస్యలను పరిష్కరిస్తూ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. మీలో ఒకడిగా కుటుంబ సభ్యుడిగా అన్ని వేళలా అండగా నిలుస్తానని భరోసా కల్పించారు. కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ నేత చలసాని స్మిత గౌతమ్, జెడ్పీటీసీ బాకీ బాబు, ఎంపీటీసీ బేతపూడి సురేష్, ఏఎంసీ వైస్ చైర్మన్ మాదు వసంతరావు, ఉమెన్ ఫైనాన్స్, టిడ్కో డైరెక్టర్లు నందిపాటి బిందుమాధవి, పి.రాఘవరావు, సర్పంచ్‌లు మేరుగు విజయ చంద్రశేఖర్, సీహెచ్ ఆదర్శ కుమార్, బొమ్మారెడ్డి శివనాగిరెడ్డి, అగ్రిబోర్డు చైర్మన్ చాట్ల విజయ్‌బాబు, ఎంపీటీసీ కోనా కిషోర్, నాయకులు భీమవరపు నాగిరెడ్డి, భీమవరపు రాజగోపాల్‌రెడ్డి, కట్టుకోలు రవిరెడ్డి, బీహెచ్ గిరిరెడ్డి, భీమవరపు రమేష్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, యార్లగడ్డ సుందరయ్య, వల్లె రాజు, దూబ నాని, తంబాబత్తుల ఓంకారం, కొండవీటి వెంకట సుబ్బారావు, తట్టుకూరి శ్రీకాంత్, కె.శ్రీనివాస్, నర్రా రమేష్ తదితరులు పాల్గొన్నారు.

హోమ్ ఓటింగ్‌లో 198 ఓట్ల వినియోగం



హోమ్ ఓటింగ్‌లో ఓటు వేస్తున్న వృద్ధురాలు

పెనమలూరు: పెనమలూరు నియోజకవర్గంలో హోమ్ ఓటర్ల ఓటింగ్ వేగంగా అమలు చేస్తున్నారు. నియోజకవర్గంలో 85 సంవత్సరాలు పైబడిన వృద్ధులు, 40 శాతం అంగవైకల్యం కలిగిన వ్యక్తులకు ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు హోమ్ ఓటింగ్‌కు అర్హులుగా ప్రకటించారు. దీనికి గాను 374 మంది హోమ్ ఓటింగ్‌కు దరఖాస్తు చేసుకున్నారు. హోమ్ ఓటింగ్ ప్రక్రియ గురువారం నుంచి ప్రారంభించారు. ఆరు టీమ్‌లు, ఆరు రూట్‌లలో హోమ్ ఓటింగ్‌కు రిటర్నింగ్ అధికారి రాజు ఏర్పాటు చేశారు. అయితే గురువారం 76 మంది, శుక్రవారం 112 మంది కలిపి 188 మంది హోమ్ ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇంకా 186 మంది హోమ్ ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవాల్సి ఉంది. 71 మంది సర్వీస్ ఓటర్లకు సంబంధించి బ్యాలెట్ పత్రాలు ఓటర్లు ఉన్న ప్రాంతాలకు అధికారులు పంపారు. హోమ్ ఓటింగ్ ప్రక్రియ కొనసాగుతుందని ఏఆర్వో ప్రసాద్ తెలిపారు.

10 మంది ఓటు వినియోగం

హనుమాన్‌జంక్షన్‌రూరల్: మండలంలోని బాపులపాడు, బొమ్ములూరు గ్రామాల్లో శుక్రవారం హోమ్ ఓటింగ్ ప్రక్రియను ప్రారంభించారు. తొలిరోజు మండలంలో పోలింగ్ ఏజెంట్లు, బీఎల్‌వో, పీవో, ఏపీవోలతో కూడిన బృందం 10 మంది నుంచి ఓటు స్వీకరించింది.

జోగి రమేష్‌తోనే పెనమలూరు అభివృద్ధి



కంకిపాడు: పెనమలూరు నియోజకవర్గ అభివృద్ధి రాష్ట్ర గృహ నిర్మాణశాఖ మంత్రి, వైఎస్సార్ సీపీ అభ్యర్థి జోగి రమేష్‌తోనే సాధ్యమని వైఎస్సార్ సీపీ ఈడుపుగల్లు నేతలు అన్నారు. గ్రామానికి చెందిన వీరమాచనేని శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పార్టీ నేతలు గ్రామంలో శుక్రవారం ఇంటింటి ప్రచారం ముమ్మరంగా నిర్వహించారు. ఎస్సీ, బీసీ కాలనీల్లో రెండు బృందాలుగా ఏర్పడి ఇంటింటికీ వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. సార్వత్రిక ఎన్నికల్లో రెండు ఓట్లూ ఫ్యాన్ గుర్తుపై వేసి వైఎస్సార్ సీపీకి విజయాన్ని అందించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు షేక్ అమీనాబి, బూరగ బాలాజీ, మాజీ ఎంపీపీ మాదు శ్రీహరిరాణి, వార్డు సభ్యులు నాగదేశి బాలకృష్ణ, గొర్రెముచ్చు ఝాన్సీరాణి, స్థానిక నాయకులు బిళ్లా వెంకటేశ్వరరావు, కాళిదాసు, పుర్రి భాస్కర్, లింగంపల్లి వరప్రసాద్, కర్రా జోజ్‌మేరీ తదితరులు పాల్గొన్నారు.

పింఛన్‌కు తప్పని పడిగాపులు



ఉంగుటూరు కెనరా బ్యాంకులో వేచి ఉన్న లబ్ధిదారులు

ఉంగుటూరు: సామాజిక పింఛన్ల నగదును లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాల్లో జమ చేయడంతో రెండో రోజైన శుక్రవారం లబ్ధిదారులు బ్యాంకుల వద్ద పడిగాపులు కాశారు. బ్యాంకులు, సీసీ పాయింట్ల వద్ద బారులు తీరారు. ఇంటి వద్దకు తెల్లవారుజామునే పింఛన్ డబ్బులు తీసుకు వచ్చి ఇచ్చే వలంటీర్లను నిలిపివేసి తమను కష్టపెడుతున్నారని పలువురు లబ్ధిదారులు వాపోయారు.

వైఎస్సార్ సీపీ శ్రేణుల విస్తృత ప్రచారం



ఎనికేపాడులో ప్రచారం నిర్వహిస్తున్న మాదు శివరామకృష్ణ, కోనేరు సుబ్బారావు



నున్నలో ఓట్లు అభ్యర్థిస్తున్న నాయకులు



సూరంపల్లిలో ప్రచారం చేస్తున్న కందిమళ్ల

రామవరప్పాడు: వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రతి ఇంటికి పెద్ద కొడుకులా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన సంక్షేమ పథకాల ద్వారా ఆదుకున్నారని గౌడ కార్పొరేషన్ చైర్మన్ మాదు శివరామకృష్ణ అన్నారు. విజయవాడ రూరల్ మండలం ఎనికేపాడు, నిడమానూరు, ప్రసాదంపాడు, రామవరప్పాడు గ్రామాల్లో గన్నవరం వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వల్లభనేని వంశీమోహన్ విజయాన్ని కాంక్షిస్తూ శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రామవరప్పాడులో సర్పంచ్ వరి శ్రీదేవి, ప్రసాదంపాడులో ఏఎంసీ మాజీ చైర్మన్ కొమ్మా కోట్లు, జెడ్పీటీసీ సువర్ణరాజు, ఎంపీపీ చెన్ను ప్రసన్నకుమారి, నిడమానూరులో సర్పంచ్ శీలం రంగారావు ఆధ్వర్యంలో ఆయా గ్రామాల ఎంపీటీసీలు, వార్డు సభ్యులు, నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎనికేపాడులో సర్పంచ్ రాచమళ్ల పూర్ణచంద్రరావు, కోనేరు సుబ్బారావు, నాయకులతో కలిసి మాదు శివరామకృష్ణ ఇంటింటికీ ప్రచారం నిర్వహించి జగనన్న మేనిఫెస్టోను వివరించారు. ఎంపీ అభ్యర్థి సింహాద్రి చంద్రశేఖరరావును, నియోజకవర్గ అభివృద్ధికి ఎనలేని కృషి చేసిన ఎమ్మెల్యే అభ్యర్థి వల్లభనేని వంశీమోహన్‌ను అఖండ మెజారిటీతో విజయం చేకూర్చాలని నాయకులు కోరారు. ఎనికేపాడులో వైఎస్సార్ సీపీ గ్రామ కన్వీనర్ మాదు సుబ్బారావు, ఎంపీటీసీలు రాచమళ్ల రత్నకుమారి, గంగుల శ్రీను, రాచమళ్ల శ్రీనివాసరావు, రామవరప్పాడులో సర్పంచ్ వరి శ్రీదేవి, నిడమానూరులో సర్పంచ్ శీలం రంగారావు, పరిమి సింధూర, ఆయా గ్రామాల్లో ఎంపీటీసీలు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

సూరంపల్లి గ్రామంలో..

గన్నవరంరూరల్: సూరంపల్లి గ్రామంలో పార్టీ కన్వీనర్ కందిమళ్ల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో శుక్రవారం ఇంటింటి ప్రచారం జరిగింది. వార్డు సభ్యుడు కందిమళ్ల రాఘవ, రాయల మహీంద్ర, తోట నవీన్‌కుమార్, నున్న సుబ్రహ్మణ్యం, కార్యకర్తలు పాల్గొన్నారు. ఇదే గ్రామంలో మండల వ్యవసాయ సలహా మండలి డైరెక్టర్ పామర్తి మాధవరావు ఆధ్వర్యంలో ప్రచారం జరిగింది. జక్కులనెక్కలంలో పార్టీ నాయకుడు ప్రకాష్, ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. సూరంపల్లి ఎస్సీ కాలనీలో పార్టీ నాయకుడు జి.కోటేశ్వరరావు ఆధ్వర్యంలో ప్రచారం ముమ్మరంగా కొనసాగింది. గోపవరపుగూడెం గ్రామంలో సర్పంచ్ నల్లూరి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం ముమ్మరంగా కొనసాగింది. పార్టీ నాయకులు బండి శివరామయ్య, రాయల మహీంద్ర, కార్యకర్తలు పాల్గొన్నారు. నాయకులు, కార్యకర్తలు నమూనా బ్యాలెట్‌తో ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించండి

నున్న(విజయవాడరూరల్): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు డాక్టర్ సింహాద్రి చంద్రశేఖరరావు, డాక్టర్ వల్లభనేని వంశీమోహన్‌లను ఫ్యాను గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని కోరుతూ నున్న గ్రామంలో వైఎస్సార్ సీపీ నాయకులు శుక్రవారం ఎన్నికల ప్రచారం చేశారు. నున్న గ్రామంలో ఎన్నికల ప్రచారంలో భాగంగా 6, 7 వార్డుల్లో శాలివాహన బజారు, గౌడ బజారుల్లో ప్రతి ఇంటికి వెళ్లి ఓటర్లను కలిసి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల కరపత్రాలను పంపిణీ చేశారు. ప్రచారంలో గ్రామ పార్టీ కన్వీనర్ పోలారెడ్డి చంద్రారెడ్డి, ఉప సర్పంచ్ కలకోటి బ్రహ్మానందరెడ్డి, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ యర్కారెడ్డి నాగిరెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కొమ్మా కోటేశ్వరరావు, చెన్ను కమల్‌రాజ్, ఎంపీటీసీ సభ్యులు బొంతు సరోజిని, పోలారెడ్డి ప్రసాద్‌రెడ్డి, ప్రత్తిపాటి రవీంద్ర, పెండెం గిరిజాకుమారి, మాజీ సర్పంచి కె.విజయ్‌కుమార్, పార్టీ నాయకులు జీతం శ్రీనివాసరావు, భీమవరపు శివరామిరెడ్డి, భీమవరపు ముత్తారెడ్డి, బొమ్మిన శ్రీనివాసరావు, కాటూరి శ్రీనివాసరావు, బొంతు సాంబిరెడ్డి, పోలారెడ్డి రమేష్‌రెడ్డి, పెయ్యల రాజా, పెయ్యల రజనీ, దండు సుబ్రహ్మణ్యం రాజు, పలువురు పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

అంబాపురంలో ప్రచారం

అంబాపురం(విజయవాడరూరల్): ఫ్యాను గుర్తుపై ఓట్లు వేసి వైఎస్సార్ సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు సింహాద్రి చంద్రశేఖరరావు, వల్లభనేని వంశీమోహన్‌ను గెలిపించాలని కోరుతూ శుక్రవారం అంబాపురం గ్రామంలో నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఇంటింటికీ వెళ్లి వివరిస్తూ, కరపత్రాలను అందజేశారు. గ్రామ పార్టీ కన్వీనర్ నల్లమోతు చంద్రశేఖర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కో కన్వీనర్ తోడేటి బెంజిమెన్, మహిళా కార్యకర్తలు పాల్గొన్నారు.

మళ్లీ వైఎస్ జగన్‌కే పట్టం కట్టాలి

హనుమాన్‌జంక్షన్‌రూరల్: ప్రస్తుత సార్వత్రిక ఎన్నికల్లో మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పట్టం కట్టాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు నక్కా గాంధీ కోరారు. స్థానిక విజయవాడరోడ్డులోని బాపులపాడు, నెక్కంటి వారి వీధి, నెహ్రూ నగర్ ఏరియాల్లో శుక్రవారం వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రజా ప్రతినిధులతో కలిసి ఇంటింటికి వెళ్లి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎంపీపీ యర్రగొర్ల నగేష్, జెడ్పీటీసీ సభ్యురాలు కొమరవల్లి గంగాభవాని, సర్పంచ్ సరిపల్లి కమలాభాయి, పీఏసీఎస్ చైర్మన్ దయాల విజయనాయుడు నేతృత్వంలో పార్టీ శ్రేణులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఫ్యాను గుర్తుపై ఓటు వేయాలని అభ్యర్థించారు. పార్టీ నాయకులు యర్రగొర్ల వెంకట్రామయ్య, మద్దాల కిన్ను, చందు నరేంద్ర, మబ్బుల్ పాల్గొన్నారు.

గన్నవరంలో ప్రచారం

గన్నవరం: వైఎస్సార్ సీపీ అభ్యర్థులు డాక్టర్ సింహాద్రి చంద్రశేఖరరావు, డాక్టర్ వల్లభనేని వంశీమోహన్‌కు మద్దతుగా గ్రామాల్లో ఆ పార్టీ శ్రేణులు విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. స్థానిక సగర్లపేట, కొత్తపేటలో శుక్రవారం పార్టీ నేతలు, వార్డు సభ్యులు గడపగడపకు వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. పీఏసీఎస్ చైర్మన్ చిమట శ్రీనివాసరావు, వార్డు సభ్యులు లుక్కా ప్రసాద్, తాడిశెట్టి మాధవీ, సగ్గుర్తి చంద్రిక, చిమట శ్రీను, దుర్గ, పార్టీ నేతలు మోదుగుమూడి వెంకటేశ్వరరావు, పడమట నాగరాజు, రంగారావు, రాంబాబు పాల్గొన్నారు. కేసరపల్లిలో వైస్ ఎంపీపీ కాలగడ్డ శివనాగరాజకుమారి ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. నాయకులు డీవీ, నీలం విజయ్‌కుమార్, బొడ్డు ఆంజనేయవరప్రసాద్, పలగాని శివాజీ, కొలుసు వెంగళరావు పాల్గొన్నారు. స్థానిక ఇస్లాంపేట, అల్లాపురం, అజ్జంపూడి, బుద్ధవరం, రమణమ్మచెరువు, వీఎన్.పురం కాలనీలో పార్టీ శ్రేణులు ప్రచారం చేశారు.

ప్రతి హామీని అమలు చేసే నైజం జగనన్నది

వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ వల్లభనేని వంశీమోహన్



నాగవరప్పాడులో ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న ఎమ్మెల్యే వంశీమోహన్

ఉంగుటూరు: మేనిఫెస్టోలో ప్రకటించిన ప్రతి ఒక్క హామీని తు.చ.తప్పకుండా అమలు చేసే నైజం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదని వైఎస్సార్ సీపీ గన్నవరం ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ వల్లభనేని వంశీమోహన్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మండలంలోని వెన్నూతల, వెల్దిపాడు, తుట్టగుంట, నాగవరప్పాడు, ఎలుకపాడు, ఉంగుటూరు, లంకపల్లి, ముక్కపాడు, ఇందుపల్లి, వేంమండ గ్రామాల్లో శుక్రవారం పర్యటించారు. ఆయా గ్రామాల్లో అధిక సంఖ్యలో పార్టీ శ్రేణులు ఆయనకు ఎదురేగి సాదర స్వాగతం పలికారు. తీన్‌మార్ డప్పు వాయిద్యాలు, పెద్ద ఎత్తున బాణసంచా పేల్చి, పూలవర్షం కురిపిస్తూ వంశీకి అపూర్వ స్వాగతం పలికారు. జై జగన్, జై వంశీ అంటూ నినాదాలు చేస్తూ అడుగడుగునా ఆయనకు బ్రహ్మరథం పట్టారు. గ్రామాల్లో ఆయనకు విశేష ఆదరణ లభించింది. యువత పెద్ద ఎత్తున ట్రాక్టర్లు, బైక్ ర్యాలీ నిర్వహించారు.

ఫ్యాన్ గుర్తుపై రెండు ఓట్లు వేయాలి..

ఈ సందర్భంగా వంశీమోహన్ మాట్లాడుతూ.. ఇచ్చిన మాటకు కట్టుబడి గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను 99 శాతం అమలు చేసిన ఘనత జగనన్నదే అన్నారు. చంద్రబాబులాగా అమలు సాధ్యంకాని బూటకపు హామీలు ఇచ్చి మోసం చేయడం జగన్‌మోహన్‌రెడ్డికి చేతకాదన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థిగా తనను, ఎంపీ అభ్యర్థిగా సింహాద్రి చంద్రశేఖరరావులకు ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు.

కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ వైద్య విభాగం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు డాక్టర్ గోసుల శివభరత్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు వింత శంకర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ-2 కోట్నాని చంద్రశేఖర్, సర్పంచ్‌లు లాం నాగేశ్వరరావు, కృష్ణారెడ్డి, పోలిమెట్ల నాని, నాయకులు గుడిసే బాలస్వామి, గుండే రవి, బొప్పన సీతారామరాజు, మండవ ప్రసాద్, కోటేశ్వరరావు, సుర్రెడ్డి శ్రీమణిమ్మ పాల్గొన్నారు.

అవే క్యూలు.. పండుటాకుల అగచాట్లు



కంకిపాడులోని కియోస్క్ సెంటర్ వద్ద క్యూలో ఉన్న పింఛన్‌దారులు

- ఎండలో వృద్ధుల అవస్థలు
- బ్యాంకులు, కియోస్క్ సెంటర్ల వద్ద పడిగాపులు
- పింఛను సొమ్ము కోసం గంటల కొద్దీ క్యూలో పాట్లు
- టీడీపీ, మిత్ర కూటమిపై మండిపడ్డ జనం
- పుట్టగతులుండవ్ అంటూ శాపనార్థాలు

కంకిపాడు: 'ఎంతో చక్కగా వలంటీర్ ఇంటికి వచ్చి పింఛనీ ఇచ్చేది. ఇదెక్కడి దరిద్రమో ఏమో?. బ్యాంకుల్లో డబ్బులు ఏసి చంపుతున్నారు. బ్యాంకుకి ఎల్లి గంటల నిలబడ్డాక పాస్ బుక్కిత్తే అక్కడ పనిచేత్తలేదన్నారు. ఎక్కడికో పంపారు. అక్కడికెల్లి పాస్‌బుక్ పనిచేయించున్నా. తిరిగి బ్యాంకులో ఇత్తే అప్పుడు పింఛనీ ఇచ్చారు. ఈ దరిద్రుడు భూమ్మీద లేకుండా పోతే మాబోటి వాళ్లకు బాధలు తప్పుతాయ్' కంకిపాడు రైతుబజారు సెంటరులో తనకు కనబడిన బంధువుల అమ్మాయితో గోడు వెళ్లబోసుకుంటూ వాపోయింది కంకిపాడుకు చెందిన వృద్ధురాలు పోరంకి విజయలక్ష్మి.

ఇప్పటికే రెండు రోజులు ఆలస్యం

ఈమె ఒక్కటే కాదు పింఛన్ లబ్ధిదారులు ప్రతి ఒక్కరి నోటి వెంటీ ఇవే కష్టాలు.. బాధలు.. శాపనార్థాలు. చంద్రబాబు, మిత్ర కూటమి కుయుక్తుల కారణంగా పింఛన్ లబ్ధిదారులు పడుతున్న కష్టాలు కొనసాగుతున్నాయి. ఈ నెల బ్యాంకు ఖాతాల్లో సొమ్ము జమచేయటంతో వారి అవస్థలు అన్నీ ఇన్నీ కావు. వరుసగా రెండో రోజూ ఏ బ్యాంకు వద్ద చూసినా గుంపులుగా, క్యూలు కట్టిన లబ్ధిదారులే కనిపించారు. బ్యాంకులు, కియోస్క్ సెంటర్లు తెరిచేందుకు ముందుగానే అక్కడ బారులు తీరారు. ఇప్పటికే రెండు రోజులు ఆలస్యం అయ్యిందని, పింఛన్ తెచ్చుకుని వెంటనే మందులు కొనుక్కోవాలని కొందరు, ఆస్పత్రికి వెళ్లాలని మరికొందరు గంటల కొద్దీ నిరీక్షించి పింఛన్ సొమ్ము తీసుకున్నారు.

బ్యాంకు ఖాతా మనుగడలో లేక అవస్థలు

చాలా మంది పింఛన్‌దారుల బ్యాంకు ఖాతాలు మనుగడలో లేవు. క్రమం తప్పకుండా లావాదేవీలు జరగని కారణంగా అవి మనుగడలో లేవు. ఆధార్ అనుసంధానం జరగలేదు. దీంతో పింఛన్ సొమ్ము కోసం వెళ్లిన లబ్ధిదారులకు అక్కడి సిబ్బంది చెప్పిన మాట పుండు మీద కారం చల్లినట్లయ్యింది. దగ్గరలో ఉన్న కియోస్క్ సెంటర్లు, బ్యాంకుల్లో ఉన్న ఖాతా అప్‌డేట్ విభాగాలకు వెళ్లి పని పూర్తి చేసుకుని సొమ్ము తీసుకునే సరికి పండుటాకుల పడ్డ అగచాట్లు వర్ణనాతీతంగా ఉన్నాయి. పింఛన్ సొమ్ము వలంటీర్లు ఇంటికొచ్చి ఇచ్చిన రోజులే బాగున్నాయని, చంద్రబాబుతో పాటు దుష్టులు పింఛనుదారులపై పగబట్టారని, వాళ్లకు పుట్టగతులుండవని, తగిన బుద్ధి చెబుతాం అంటూ తిట్లదండకం అందుకున్న పరిస్థితి బ్యాంకులు, కియోస్క్ సెంటర్ల వద్ద కనిపించింది.

హాయిగా బతకటం ఇష్టం ఉండదు



పింఛను సొమ్ము టైంకి వస్తే ఆస్పత్రిలో చూపించుకుని మందులు తీసుకుంటాం. ప్రతి నెలా అదే చేస్తున్నాం. కానీ రెండు నెలలుగా మా పరిస్థితి అధ్వానంగా తయారైంది. టైంకి పింఛను రాదు. ఇప్పుడేమో బ్యాంకుల్లో వేశారు. అక్కడేమో క్యూలు. సరైన సమాధానం చెప్పేవాళ్లు లేరు. ఎవరో చేసిన కంప్లైంట్లతో మాకు కష్టాలు వచ్చి పడ్డాయి. మేము హాయిగా ఉండటం ఆ పెద్దోళ్లకు ఇష్టం ఉన్నట్టు లేదు.

– శేగు రత్తమ్మ, లబ్ధిదారు, కంకిపాడు

నేటి నుంచి పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్



పెనమలూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల

పెనమలూరు: పెనమలూరు నియోజకవర్గంలో ఉన్న పోస్టల్ బ్యాలెట్ ఓటర్లు తమ ఓటు హక్కును గురువారం నుంచి వినియోగించుకోవాలని పెనమలూరు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి డి.రాజు తెలిపారు. ఆయన శుక్రవారం వివరాలు తెలుపుతూ ఎన్నికల విధుల్లో ఉన్న ఉద్యోగులు పెనమలూరు నియోజకవర్గం(78) మచిలీపట్నం పార్లమెంట్(11) నియోజకవర్గాలకు చెందిన పోస్టల్ బ్యాలెట్ ఓట్లు 4 నుంచి 6వ తేదీ వరకు ఓటు వేయాలని ఎన్నికల కమిషన్ ఆదేశించిందన్నారు. ఈ మేరకు పెనమలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామని చెప్పారు. పోస్టల్ బ్యాలెట్ ఓటర్లు పెనమలూరు నియోజకవర్గంలో 3,331 ఉండగా పెనమలూరు నియోజకవర్గానికి చెందిన ఓట్లు 1,782 ఉన్నాయన్నారు. ఈ 1782 మంది ఓటర్లు ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల లోపు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. 4న పీవోలు, ఏపీఓలు, సూక్ష్మ పరిశీలకులు ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. 5న ఇతర పోలింగ్ సిబ్బంది ఓటు వేయాలన్నారు. 6న అత్యవసర సర్వీసులు, పోలీసులు, ఇతరులు ఓటు హక్కు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

•నున్నలో పూజలు

నున్న(విజయవాడ రూరల్): వైఎస్సార్ సీపీ అభ్యర్థులు ఎన్నికల్లో గెలుపొందాలని నున్న గ్రామంలోని శ్రీ మద్దిరావమ్మ గుడిలో పార్టీ నాయకులు శుక్రవారం పూజలు చేశారు. మాజీ ఎంపీపీ, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ యర్కారెడ్డి నాగిరెడ్డి, మాజీ ఉప ఎంపీపీ జీతం శ్రీనివాసరావు, సొసైటీ డైరెక్టర్ భీమవరపు ముత్తారెడ్డి, దండు సుబ్రహ్మణ్యంరాజు పాల్గొన్నారు.